International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# యోగి వేమన సూక్తులకు బైబిల్ జ్ఞాన వాక్కులకు సమతుల్యత

**ఫాదర్ డాక్టర్ గుజ్జుల అంతోని పీటర్ కిశోర్, ఎస్. జె**

**ప్రిన్సిపల్, ఆంధ్ర లొయోల (స్వయంప్రతిపత్తి) కళాశాల, విజయవాడ**

'తులనాత్మక సాహిత్యమంటే నిర్దేశిత దేశ సరిహద్దులకు అతీతంగా ఒక సాహిత్యాన్ని మరొక సాహిత్యంతోనో, సాహిత్యాలతోనో, సాహిత్యేతర వైజ్ఞానిక శాఖలతోనో తులనాత్మకంగా పరిశీలించడం' అని తులనాత్మక సాహిత్య పరిశోధకుడైన H.H. Remak నిర్వచించారు (జయప్రకాశ్, ఎన్. తులనాత్మక సాహిత్యం, శ్రీ దివ్య పబ్లికేషన్స్, మదురై, 1998, 6).

బైబులు జ్ఞాన సాహిత్యంలో సోలోమోను, సీరా తదితర జ్ఞానుల సరసన నిలువదగిన తెలుగు యోగి వేమన. వేమన పద్యాలలో ఎక్కువగా లోక నీతులు, సామాజిక చైతన్యంనకు సంబంధించినవి ఉంటాయి. అతను స్పృశించని అంశం లేదు. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లోంచి దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించాడు. కుటుంబ వ్యవస్థలోని లోటు పాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించడం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు ఒకటేమిటి కనిపించిన ప్రతి సామాజిక అస్థవ్యస్థత మీద వేమన కలం ఝుళిపించాడు. ఈ పద్యాలకు బహుళ ప్రచారం లభించటానికి కారణాలు చాలా ఉన్నాయి. సామాన్య నీతులను ప్రజల హృదయాలకు హత్తుకొనేటట్లు వారికి పరిచితమైన భాషలో, స్పష్టమైన రీతిలో సూటిగా, తేటగా, శక్తివంతంగా వ్యక్తీకరించటం, సామాన్యులైన వారిలో తనను ఒకనిగా భావించుకొని నీతి ఉపదేశం చేయటం వేమన నీతులలోని ప్రధాన గుణం. సునిశితమైన హాస్య, వ్యంగ్య, అధిక్షేప చమత్కృతులతో కవ్వించి, నవ్వించి ఎదుటివారి లోపాలను, తన లోపాలను, గుర్తెరిగి ఉపదేశించిన రీతిని గమనించేటట్లు చేసే శైలిని ఆయన ప్రదర్శించాడు. సామాన్యాలు మనోజ్ఞాలు అయిన ఉపమాన దృష్టాంతాలతో సూక్తిప్రాయంగా నీతులను బోధించాడు.

అలాటి వేమన పద్యాల జ్ఞాన వైభవాన్ని బైబులు సామెతలతో పోలుస్తూ వ్రాసిన పరిశోధనా వ్యాసమిది.

1. తెలుగు సామెత: రౌతును బట్టి గుఱ్ఱము; యథా రాజా తథా ప్రజ

బైబులు సామెత: పాలకుడెట్టివాడో ప్రజలట్టి వారగుదురు (సీరా 10:2)

రాజు నీలివార్తలు వినువాడైనచో, మంత్రులు కొండెములు చెప్పుదురు (సామెతలు 29:12)

వేమన సూక్తి

'ప్రభువు క్రోతియైన ప్రగ్గడ పందియో
సైనికుండు పక్కి సేన పనులు
ఏన్గులశ్వంబులును నెలుకలు పిల్లలు.

స్థూలంగా పాలకులను బట్టి పాలితులుంటారని ఈ సామెతలు ప్రతిపాదిస్తు న్నప్పటికీ, అల్పులు, దుష్టులు అయిన పాలకులకే సాధారణంగా వీటిని అన్వయిస్తారు. చెప్పు తినే కుక్క చెఱకు తీపి ఎరగనట్లు అల్పబుద్ధి గలవానికి అధికారమిస్తే మంచివారందరినీ వెళ్ళగొడతాడు. పీనుగు ఉన్నచోట రాబందులు చేరినట్టు మూరు? డైన రాజు చుట్టూ దుర్మార్గులు చేరుతారు. రాజులు నిరంకుశులు. అప్రియాలు మాటలాడేవారిని నిరసిస్తారు. రావణాసురుని కొలుపులో నుండి విభీషణుడు. పైదొలగినట్టుగానే అనువుగానిచోట అధికుల మనరాదు అని గ్రహించి విజ్ఞులంతా దుష్ట పాలకుల పంచ నుండి నిష్క్రమిస్తారు.

ఇకపోతే స్థూలంగా యజమాని దుష్టుడైతే ఆ నైజం గల వ్యక్తులే అధికార స్థానాల్లో ఉంటారు. అదొక పాముల పుట్టలా తయారవుతుంది. అలాటివానిని నమ్మిన బంటులు తమ పబ్బం గడుపుకొనేందుకు లేనిపోని వార్తలు పుట్టించి చాడీలు చెప్పి వాస్తవానికి దూరం చేసి అతని పతనానికి కారణమవుతారు, దుర్యోధనుని అంతరంగిక వర్గం దుష్ట చతుష్టయమే ఇందుకు మంచి ఉదాహరణ, విదుర నీతులు చెవిని పెట్టకుండా, శకుని తదితరుల కుటిల వాక్కులకు సమ్మతిస్తూ, చివరికి కురు వంశక్షయానికి కారకుడైనాడు రారాజు.

అటువంటి యజమాని వద్ద చేరేవారు అతని క్షేమమేమాత్రం ఆశించక వంచనతో తమ బొజ్జలు నింపుకొనేందుకు కపటాలు పలుకుతుంటారు. ఇలా పరస్పరం వంచించుకొంటూ ఆ రాజును ఆశ్రయించిన వారికి న్యాయం జరగనీయకుండా చేస్తారు. రాజులకు ఉన్నత భావాలు, ఉదాత్త గుణం ఉండాలి. తనవారిలో యోగ్యులెవరో, పండితులెవరో, పుణ్యాత్ములెవరో పసిగట్టగలిగే కుశాగ్రబుద్ధి ఉండాలి. చెప్పుడు మాటలకు చెవినియ్యక యుక్తాయుక్త విచక్షణ కలిగి ప్రతి విషయంలోనూ తానే ఒక అంచనాకు రాగలిగి యుండాలి. తెలుగు సామెత ఈ చర్చనీయాంశాన్ని మరికొంత దూరం తీసుకువెళుతున్నది. రాజు దుష్టుడైతే ప్రజలు కూడా అలాటి వారే అవుతారన్న భావం కూడా గమనించదగినదే. యధా రాజా తథా ప్రజ అనే నానుడి లోక ప్రసిద్ధమైనదంటే అటువంటి పరిస్థితులు లోకంలో కనిపిస్తున్నాయి. కనుకనే రాజు ధర్మం తప్పి, విషయలోలుడై చరించేవాడైతే మొత్తంగా ప్రజానీకంలో ధార్మిక దృష్టి నశిస్తుంది. అరాచకం ప్రబలుతుంది. బలవంతులదే పెత్తనమవుతుంది. అని ఈ సామెతలు సెలవిస్తున్నాయి.

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

2. తెలుగు సామెత: పెద్దల మాట చద్దిమూట

బైబులు సామెత: జ్ఞానుల ఉపదేశము జీవజల ధారలు (సామెతలు 13:14).

వేమన: 'కస్తూరినటు చూడ గాంతి నల్లగనుండు.
పరిమళించు దాని పరిమళంబు
గురువులైన వారి గుణము లీలాగురా!'

పెద్ద తలకాయ లేకుంటే ఎద్దు తలకాయ తెచ్చి పెట్టుకోమంటారు. వయస్సులోను, జ్ఞానంలోనూ సమాజంలో పెద్దరికం వహించిన వారిని ఆచార వ్యవహారాలకు పిలిచి కూర్చోబెట్టుకోవడం మర్యాద. మర్యాద మాత్రమే కాదు, అదెంతో మేలు, కొన్నిసార్లు వారు చెప్పే మాటలు రుచించకపోవచ్చు గానీ అనుభవజ్ఞులు చెప్పే మాటలను ఔదలదాల్చడం మన విధి. పెద్దల మాట చద్దిమూట అనే తెలుగు సామెత తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైనది. అక్షర లక్షల విలువ చేసేది.

గురుతుల్యుల మాటలు, గుణాలు కస్తూరి పరిమళ సదృశాలు, ఈ సామెత అంత ఆత్మీయంగా ధ్వనించడానికి కారణం అందులో చల్లగా ధ్వనిస్తున్న 'చద్దిమూట' అనే పదబంధం, కృషీవలుడు తొలికోడి కూసే వేళకే లేచి రాత్రి మిగిలిన అన్నంలో ఇంత చల్లపోసి రెండు పచ్చిమిరపకాయలు వేసుకొని గిన్నెను మూట కట్టుకొని పొలం వెళతాడు. పొద్దెక్కే వరకు వంచిన నడుము ఎత్తకుండా పనిచేసి ఎండ చిటపడలాడిస్తుంటే తలపాగా తీసి జలజలా పారుతున్న బోదె నీటిలో ముఖం కడిగి నీడలో కూర్చుని చద్దిమూట విప్పి తింటుంటే అంతకన్నా పరమాన్నం లోకంలో వేరే లేదనిపిస్తుందతనికి. ఆ మాధుర్యం తెలిసిన జానపదుల వ్యవహారంలో చల్ల చిలికితే పుట్టిన వెన్నపూసలాగా ఈ సామెత పుట్టింది.

యూదుల దేశం పర్వతమయం, కొండల్లో పుట్టి ధారకట్టి జాలువారే జలతారు తీగెల వంటి జలధారలు ఆ జాతికి అమృత సదృశ్యాలు, మిట్టపల్లాలలో మిట్ట మధ్యాహ్నం వేళ పయనించే పాంథునికి ఆ కొండల్లోని చిరుజలపాతాలు సేద దీరుస్తాయి. అందుకే యూదుల్లో పుట్టిన సామెత పెద్దల సదుపదేశాన్ని చన్నీటి ఊటతో పోల్చింది.

దగ్గర చేరినవారికి వటవృక్షం చల్లని నీడనిచ్చినట్టు సజ్జనులైన పెద్దలు మంచి మాటలతో మనస్సును రంజింపజేసి హితం చేకూరుస్తారు. యుక్తాయుక్త విచక్షణ, అపారమైన జీవితానుభవం, లౌక్యం ఎరిగిన పెద్దలు సమయానుకూలమైన మాటలతో పరిస్థితిని చక్కదిద్దుతారు. సంయమనంతో, చనువుగా, మందలింపు మాటలతో ఆవేశాలు చల్లారుస్తారు. దిక్కుతోచని వేళ కర్తవ్య బోధనతో శంకానివృత్తి కలిగించి మనస్సు చల్లబరుస్తారు. 'ఫక్కి తెలిసి పలుక నొళ్ళు వాక్యమే చాలు' అని వేమన అన్నట్టుగా విధం తెలిసి సరియైన సలహా ఇచ్చే పెద్దలు పూజ్యులు అలాటివారి పల్కులు

శిరోధార్యం. ఈ సత్యాన్ని ఈ సామెతలు వివరిస్తున్నాయి.

3. తెలుగు సామెత: మెరిసేదంతా బంగారం కాదు. తెల్లనివన్నీ పాలు కావు, నల్లనివన్నీ నీళ్ళు కావు

బైబులు సామెత: మంచిదారివలె కనిపించునది కూడా మృత్యువుకు దారితీయును. (సామెతలు 14:12)

వేమన:

'కట్టుబట్ట జూచి ఘనత చెప్పగరాదు.
కాసరావు లోని ఘనతలెల్ల
జంగమైన వాని జాతినెంచగ విల్లు'

యదుకుల తిలకుడు శ్రీకృష్ణునికి తాను సాటి అని భావించిన పౌండ్రక వాసుదేవుని గాథ లోక విదితం. అతడు కూడా కృష్ణుని వలె పీతాంబరాలు ధరించి, శంఖచక్రాలు చేబూని, అష్ట భార్యలను చేపట్టి వాసుదేవ నామధారియై విర్రవీగేవాడట. శ్రీకృష్ణుని మీదకు కాలు దువ్వి చివరకు ఆయన చేతిలోనే చనిపోయాడు. పై ఆకారము, నిగారింపులు ఒకటిగా ఉన్నంత మాత్రాన మౌలిక భేదాలు సమసిపోవు అనే సార్వత్రిక సత్యాన్ని ఈ తెలుగు సామెత ప్రతిపాదిస్తున్నది.

ఇదే అంటున్నాడు వేమన. ఆర్భాటంగా వేసుకొన్న ఆహార్యాన్ని బట్టి యోగ్యతను నిర్ణయించరాదు. విభూతి పూసుకొన్నంత మాత్రాన ఒకడు జంగమదేవర అయిపోడు. బీరాలు పలికినా ఉత్తర కుమారుడు లోకోత్తర వీరుడు కానేరడు. వేమన గుర్తించినదే మరొకటి ఉప్పుకప్పురంబుల కున్న ఒక్క పోలిక, అయితే కర్పూరానికున్న విలువ ఉప్పుకెక్కడిది? బాగా తోమి తళతళా మెరిసేలా చేస్తే ఇత్తడి పుత్తడిని మించి ప్రకాశిస్తుంది గదా!

బైబులు సామెత కూడా ఇదే సత్యాన్ని ఆవిష్కరిస్తున్నది. మనుషులు లోతుపాతులు తెలుసుకోకుండా తాము. నడిచేది సన్మార్గమే ననుకుంటూ జీవిస్తారు. కాబట్టి కంటికి మంచిగా కనిపించినంత మాత్రాన అది సన్మార్గమని భ్రమించడం తగని పని అని ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి.

4. తెలుగు సామెత: నిజం నిలకడ మీద తేలుతుంది.

బైబులు సామెత: సత్యము కలకాలముందును (సామెతలు 12:19)

వేమన సూక్తి

'కల్లు డ్రాగువాని కల్లు మ్రుచ్చనరాదు
కల్లలాడు వాడే కల్లు మ్రుచ్చు
కల్లు డ్రాగుకంటె కల్లలాడుట కీడు'
విశ్వదాభిరామ వినురవేమ

సత్యసంధతకు మన సంస్కృతిలో ఆపాదించిన విలువ, ప్రాముఖ్యత సాటిలేనివి. వేమన వాణి ఈ పరమ సత్యాన్ని పొదుపుగా ప్రస్తావించి వన్నెకెక్కింది.

నిజములాడునతడు నిర్మలుడై యుండు

'నిజమునాడు నతడు నీతిపరుడు నిజము పలzకున్న నీచ చండాలుడు'

అయితే సూనృత వాక్యంతో ఉన్న ఇబ్బంది ఏమిటంటే ప్రస్తుతానికి దానిని లోకులు నమ్మరు, మెచ్చరు. ఈసడించవచ్చు, హేళన చేయవచ్చు. అయితే లోకుల ఆమోద తిరస్కారాలతో నిమిత్తం లేకుండా సత్య వచనం శిలాక్షరం వలె అజరామరం.

తాను దుష్యంత పత్నినని తన చంకనున్న బిడ్డడు అతని తనూజుడనీ శకుంతల పేరోలగంలో దుష్యంతునితో ఎలుగెత్తి ఆక్రోశించిన వేళ పలికిన విషయాలు లోకప్రసిద్ధాలు, 'నుతజల పూరితంబులైన నూతులు నూరిటి కంటే ఒక బావి మేలనీ, నూరు బావులకన్నా ఒక సత్రుతువు మేలనీ, అలాటి నూరు యజ్ఞాలకన్నా ఒక కుమారుడు మిన్నయనీ, అలాటి సుత శతం కన్నా ఒక్క సత్యవాక్కు మేలనీ మహా భారతంలో నన్నయ శకుంతల నోట పలికించిన సూక్తి వేదవాక్కు. దుష్యంతుడు సంప్రదాయానికి వెరసి ఆమెను తిరస్కరించినప్పటికీ నిజం నిలకడమీద తేలి ఈ రమ్య కథనం సుఖాంతమయ్యింది.

అనృత వాక్యాలు రేపే కారుచిచ్చు వలన కొంపలు కూలుతాయి. కల్లమాటలు కలతలకు కారణమవుతాయి.

అబద్ధం చీకటి. సత్యం అఖండ జ్యోతి, కాంతి కిరణాలు చీకటిని పటాపంచలు చేసినట్టు ఆలస్యమైనా సత్యమనేది సూర్యప్రకాశం వలె ఉదయించినప్పుడు అసత్యానికి కాలుమోపే స్థలముండదు. తెలుగు సామెత నేపథ్యం, సారాంశం.

బైబులు సామెత దీనితో ఏకీభవిస్తూ సత్యం కలకాలం ఉంటుందని చెబుతున్నది. అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుకునేవారు కలకాలం వర్ధిల్లలేరు. సత్యహరిశ్చంద్రుడెన్ని ఇడుముల పాలైనా అతని సత్యసంధత ఎట్టకేలకు సర్వులకూ విధితమై షట్చక్రవర్తుల్లో ఒకడుగా అతడు వినుతికెక్కాడు. సత్యానికే అంతిమ విజయం అని ఘోషిస్తున్న ఈ సామెతలు అక్షర సత్యాలు.

5. తెలుగు సామెత: ఉప్పు లేని పప్పు

బైబులు సామెత: ఉప్పు లేని చప్పిడి కూడు (యోబు 6:5)

వేమన సూక్తి

"నేయిలేని కూడు నీయాన కనువది
కూరలేని తిండి కుక్కతిండి.
ప్రియము లేని కూడు పిండపు కూడురా'

వేమన యోగి కాకమునుపు పూర్వాశ్రమంలో భోగిగా ఉండేవాడని రాళ్ళబండి అనంత కృష్ణ శర్మ తదితర పరిశోధకులు అభిప్రాయపడ్డారు. రుచులను గురించి వేమన సహజ సుందరమైన పద్యాలు వ్రాయడం కూడా బహుశ ఇలా ఊహించడానికి దోహదం చేసి ఉంటుంది.

భోజనం షడ్రసోపేతంగా లేకున్నా

చవులూరించేదిగా ఉండాలి. 'వివాహ భోజనంబు' అందరికీ అందని మాని పండయినా ఎవరి పరిధిలో వారు ఉప్పుతో ఉల్లిపాయలతో నోటికి హితవైన ఆహారమే భుజించడానికి ప్రయత్నిస్తారు. తెలుగువారి భాగ్యమేమిటో గానీ ఎంత లేమిని అనుభవించేవారింట అయినా అవకాయ, నేతిచుక్క ఉండక మానవు. వేమన అంటున్నది అదే. కమ్మని నేయి వడ్డించుకొనని భోజనం భోజనమే కాదు. కూరలేని అన్నాన్ని ఊహించలేము. ఇల్లాలు ప్రక్కనే కూర్చుని విననక్కురతో వినరుతూ కొసరి కొసరి ప్రియంగా వడ్డిస్తుంటే అరగించేవాడే రాజేంద్ర భోగి.

ఇవేమీ లేకుండా ఉప్పు కూడా లేని పప్పును తినడమంటే నిస్సారమైన, సంతోషం లేని జీవితాన్ని జీవించడం. బైబులు సామెత కూడా ఇటువంటి నేపథ్యం నుండే పుట్టి ఈ అర్థాన్నే బోధిస్తున్నది.

బైబులు సామెత బాధాసర్పదష్టుడైన యోబు పలికిన మాట. అరిష్టం ముంచుకు రాకమునుపు తాను నోటపెట్టనొల్లని పదార్థాలిప్పుడు తనకు తప్పనిసరి ఆహారమైనవని చెప్పే సందర్భంలో అతడు వాడిన సామెత ఇది. జిహ్వాకు హితము గాని ముద్దనెవరూ నోటబెట్టారు. తన బ్రతుకలా నిస్సారమై చివికి చప్పిడిగా ఉందని యోబు వాపోతున్నాడు.

6. తెలుగు సామెత: లంజకు పెట్టినపెట్టు గోడకు పూసిన సున్నం భోగం దాని వలపు బొగ్గు తెలుపు లేవు.

బైబులు సామెత: వేశ్యకు వ్యాదయము నర్పించకుము; నీ ఆస్తియంతయు గుల్లయగును (సీరా 9:6)

వేమన సూక్తి

బత్తిలేక లంజె పలుమారు పిలిచిన
బత్తికాదు లయపు మిత్తిగాని
మిత్తి చొరగనిల్లు మ్రింగకపోవునా?
విశ్వదాభిరామ వినుర వేమ.

కాలిని విడిచి పరస్త్రీ పొందుకై తిరిగేవాడు ఇంటి పెరడులో తియ్యనైన ఊటబావిని విడిచి దారుల పక్కన నిలిచిన వర్షపు నీటి గుంటలకు పోయేవానితో సమానం, బైబులు సామెతల గ్రంథం తొలి అధ్యాయం నుండి పరస్త్రీ భ్రమలో, ముఖ్యంగా వారకాంతల ఉన్మాదంలో పడిపోయేవారికి అనేకానేక హెచ్చరికలున్నాయి.

వేశ్యలు అనేక వయ్యారాలు పోతూ ప్రేమ నటిస్తారు. వారు కేవలం వెలదులు, వారికి ఈ రోజు ఒకడు, రేపు మరొకడు. ఎవరి చేత ధనపు నంచి ఉంటే వాడే ప్రియుడు. భోగం దాని వలపు ఎండమావి, తెల్లని బొగ్గు ఉంటుందంటే ఎంత విడ్డూరమో వారకాంత వలచిందంటే అంత విడ్డూరం. ఆమె ఇష్టమంతా విటుడు తెచ్చే డబ్బు పైనే. ఒకసారంటూ ధనకనకాలను వేశ్యపాలు చేస్తే అవి ఇక తిరిగి వచ్చే ప్రస్తావన లేదు. తెలుగు

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

సామెతలో లోక వ్యవహారమొకదానితో దీనిని పోల్చడం సమయోచితంగా ఉంది. సున్నం మన పాత్రలో ఉన్నంతవరకే మనది. దానిని గోడకు పూశామో, అది ఇక ఒక్క చుక్క కూడా తిరిగి రాదు.

బైబులు సామెతలో కూడా ఇదే భావం ద్యోతకమవుతున్నది. వేశ్యాలోలత్వం సర్వదా గరనీయంగా బైబులు పేర్కొంటుంది. జారస్త్రీ నడత పాతాళానికి నడిపిస్తుందనీ, ఆమె ఇచ్చకాలు రెండంచుల కత్తివంటివనీ పరిపరివిధాల యువతకు ప్రబోధాలు ఉన్నాయి. పదుపు స్త్రీ మోహంలో తమ బ్రతుకులు, కాపురాలు సర్వనాశనం చేసుకొన్నవారు కోకొల్లలు, వయసు మీరుతున్న ఇల్లాలిని నిరసించి వయసులో ఉన్న పరస్త్రీలకు, వారకాంతలకు మోహితులయ్యే వారు దుర్మార్గులు, తన కుటుంబం, పిల్లాపాపలు అనుభవించవలసిన సంపదలను వారు చేజేతులా వేశ్యలపాలు చేస్తారు. డబ్బు నిండుకుని, దేహం వ్యాధిగ్రస్థమైనాక అదే వేశ్య చీత్కరించి గెంటివేస్తే మళ్ళీ తన భార్య పంచకే చేరుతాడు.

పురుషులలో ఈ చిత్తచాపల్యం అతి ప్రమాదకరమైనది. వారు అజ్ఞానంగా వేశ్యను నమ్మి సమస్తం ఆమెకు సమర్పించుకొని ఫకీర ఫకీరులౌతారు. ఇటువంటివారిని మాలవాడలోని మాంసాన్ని మరిగిన కుక్కలతో పోల్చాడు వేమన,

'ఆలు రంభయైన సతి శీలవతియైన
జాలపురుషుడేల జాడమాను
మాలవాడ కుక్క మరిగిన విడుచునా!'

7. తెలుగు సామెత: పిండి కొలది రొట్టె.

బైబులు సామెత: కట్టె కొలది మంట (సీరా 28:10)

వేమన సూక్తి

'కానలేదు నుదురు కర్ణముల్ వీపును
నెరులు కానలేదు నెత్తిమీద
తన్ను కానలేదు దైవము నెరుగునా'
విశ్వదాభిరామ వినుర వేమ

ఒక దర్భను మండించి భూనభోంతరాళాలు వ్యాపించే అగ్నిహోత్రం వెలగాలని చూడడం అత్యాశ, చిటికెడు పిండితో భూదేవంత రొట్టె చేయాలనుకోవడం పేరాశ. ఎవరి తాహతుకు సరిపడిన ఆశలు, ఆకలి వారికుండాలనే హితవు ఈ తెలుగు, బైబులు సామెతల్లో వ్యక్తమవుతున్నది.

రాచవారి బిడ్డను రాకుమారుడే చేపడతాడు. పాలికాపు పట్టిని పేదవాడే పరిణయమాడతాడు. నిరుపేద తండ్రి గంతకు తగ్గ బొంత చందాన తాను తూగగలిగిన సంబంధం కోసమే చూస్తాడు. తోటలో పిల్ల కోటలో రాణి కావాలని కలలు కనడం ఔచిత్యమనిపించుకోదు. ఎంత చెట్టుకు అంత గాలి కదా!

జలధిని లంఘించి లంకాపురి చేరి సీతాన్వేషణం చేపట్టాలి. సుగ్రీవ సుషేణ జాంబవంతాది

వానరవీరులు తామొక్కక్కరూ ఇన్ని అమడులు మాత్రం లంఘించ గలమని తమ అశక్తతను వెల్లడిస్తారు. అంత దూరం ఆకాశ మార్గాన ఎగిరి వెళ్ళగలిగిన వాడు వాయునందనుడొక్కడే. ఇలా తమ బలపరాక్రమాల శక్తి సామర్థ్యాల అంచనా ఎరిగి ప్రవర్తిల్లేవాడే బుద్ధిమంతుడు.

పేదవాడు ఎవరిమీదైనా కోపగించుకుంటే పండ్లు కొరికి, పెదవి కొరికి తనను తాను బాధించుకొనడమే మిగులుతుంది. రాజు తలుచుకొంటే మాత్రం దెబ్బలకు కొదువ ఉండదు. సాధ్యాసాధ్య విచక్షణ కలిగి కార్యాలు తలపెట్టాలి. ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికై అర్రులు చాచిందట!

ముచ్చటగా మూడు పదాలతో పై రెండు సామెతలూ సామాన్యులు పాటించ వలసిన జీవన సరళిని కళ్ళెదుట ఉ ంచుతున్నాయి. ప్రతివాడూ తన పరిధిలో తన స్థితిని గుర్తెరిగి ఆకాశానికి నిచ్చెనలు వేయక గుట్టుగా జీవనం గడపాలని ఈ రెండిటి సారాంశం. అలా కాక అప్పుచేసి పప్పుకూడు చందాన లేనిపోని భేషజాలకు, బడాయిలకు పోతే భంగపాటే.

మనషన్నవాడు తన నొసటిని, చెవులను, వీపును, నడినెత్తిని తానే చూడలేడు. అలాటిది దేవుణ్ణి చూడాలని కుతూహలపడడంలో అర్థమేముంది. ఎవరికేది సాధ్యమో ఎవరికేది ప్రాప్తమో అంతవరకే అని గ్రహించమని ఈ సామెతల ఉద్బోధ.

8. తెలుగు సామెత: తప్పులు వెదకువాడు తండ్రి, ఒప్పులు వెదకువాడు ఓర్వలేనివాడు.

బైబులు సామెత: తనయుని ప్రేమించు తండ్రి వానిని శిక్షించి తీరును. (సామెతలు 13:24)

వేమన సూక్తి

'చాకి కోకలుదికి చీకాకు పడజేసి
మైలదీసి లెస్స మడుపు జేయుబీ
బుద్ధి చెప్పువాడు గుద్దిన నేమయా!"

'సుతో లాలనా వినశ్యతి' అన్నారు ఆర్యులు, అతి గారాబంతో సుతులు చెడిపోతారు. తనయుని మేలుగోరే తండ్రి దండించైనా కొడుకుని ఉత్తమ మార్గంలో ఉంచుతాడు. పరునికి అటువంటి అవసరమేమున్నది? వారు కేవలం శ్లాఘనీయమైనది కనిపించినపుడు మెచ్చుకుని వదిలి వేస్తారు. గర్హనీయమైనది గోచరమైతే మిన్నకుండి పోతారు. పిల్లలకు సహజ చాపల్యం వలన దండించే తండ్రికన్నా లాలించే పరులే ప్రియులుగా కనిపిస్తారు. తెలుగు బైబులు సామెతలు రెండూ తండ్రి దండించేది కొడుకు క్షేమానికేననీ, అది అవ్యాజానురాగ ఫలితమేననీ నొక్కి చెబుతున్నాయి.

పౌలు భక్తుడు రాస్తూ తండ్రి దండింపని కుమారుడెవరు? అని ప్రశ్నించాడు, దండన ప్రస్తుతం దుఃఖకారణమే గాని అది శాశ్వత ఫలమిస్తుంది (హెబ్రీయులకు 12:7-11). దేవుని

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

చేతినుండి వచ్చే శిక్షను మనం నిరసించామా, మనం కొరగాని వారిమే కానీ కుమారులం కామని తేల్చి చెప్పాడు.

వేమన చెప్పినట్టుగా చాకలివాడు వస్త్రాన్ని సబ్బుతో క్షారంతో ఏటి ఒడ్డున బండకేసి బాది బాది బాధిస్తాడు. అది దానికంటిన మైల వదలగొట్టేందుకే, అలానే శ్రేయోభిలాషి యైన తండ్రి బెత్తము వాడి బాలుని సన్మార్గంలో నడుపుతాడు. పరాయివారు పిల్లవాడు చెడు దారిన ఉన్నా అది సవ్యమైనదేనంటూ ఇచ్చకాలాడి అతడు అదే మార్గంలో విచ్చలవిడిగా కొనసాగేందుకు దోహదం చేస్తారు. హితుడు మేలుగోరి గాయం చేస్తాడు, పగవాడు లెక్కలేనన్ని ముద్దులు పెడతాడు అనే బైబులు సూక్తి పై తెలుగు సామెతకు ప్రతిబింబం, బెత్తం వాడని తండ్రి కుమారుని బద్ద శత్రువని ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి.

9. తెలుగు సామెత: చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు

బైబులు సామెత: మంచివాడు తన పిల్లల పిల్లలను ఆస్తికర్తలనుగా చేయును. పాపాత్ముల ఆస్తి నీతిమంతులకు ఉంచబడును. (13: 22)

వేమన సూక్తి

ధనము కూడబెట్టి ధర్మంబు చేయక
తాను తినక లెస్సదాచుగాక
తేనె టీగ గూర్చి తెరువరి కీయదా
విశ్వదాభిరామ వినురవేమ!

కొందరు డబ్బు సంపాదించి, దానం చేయకుండా, తమకు తాము తినకుండా దాచిపెడతారు. దీనిని వేమన తేనెటీగలతో పోలుస్తాడు. తేనెటీగలు తేనెను కూడబెట్టుకుంటాయి, కానీ ఆ తేనెను మనుషులు తీసుకెళ్లి వాడుకుంటారు. అలాగే, మనుషులు కూడబెట్టిన ధనం కూడా ఇతరులకు ఉపకరిస్తుంది.

చీమలు అవిశ్రాంతంగా కష్టించి పుట్టలు పెడతాయి. అంటే ఇల్లు కట్టుకుంటాయి. కాని వాటిలో చివరకు పాములు నివసిస్తాయి. అంటే చీమలు వాటి కష్ట ఫలితాన్ని అవి అనుభవించలేవన్నమాట. ఈ స్థితిని వివరిస్తూ ఎందరో వేదాంతులు ఇదే భావాన్ని సామెతల రూపంలో, ప్రబోధాల రూపంలో తెలియజేశారు.

'చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు
పామరుడు తగన్,
కూడబెట్టిన ధనమెల్ల, భూమీశుల పాలజేరు
భువిలో సుమతీ' అంటాడు బద్దెన.

తేనెటీగ గూర్చి తెరువరికీయడా' అంటాడు. అంటే ఎవరి కష్టాన్ని వారు అనుభవించ కుండా, ఇతరులు అనుభవిస్తున్న పరిస్థితులలో ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు. తేనెటీగ పువ్వు పువ్వును చేరి తేనెను స్వీకరిస్తుంది. ఒక చోట కూడబెడుతుంది. కాని దానిని ఇతరులు అనుభవిస్తారు. పిసినారి ధనాన్ని కూడబెడతాడు. దానిని పరులు అనుభవిస్తారు. ఇది సమాజంలో నిరంతరం జరుగుతూ ఉన్నదే. ఆ స్థితిని

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

వివరించడానికి పై సామెతను ప్రయోగిస్తారు. చిన్నయసూరి మిత్రలాభములో ఇటువంటివారి ధనాశ గురించి చెబుతూ "వాయికట్టి, కడుపుకట్టి, ధనము గడించువాడు పరులకయి మోపు మోచువానియట్లు క్లేశమునకు మాత్రము పాత్రము" అంటాడు.

బైబులు సామెత కూడా ఇదే భావాన్ని వ్యక్తీకరిస్తుంది. మానవుడు తాను తినక సుఖవర్జన చేసి సంపాదించిన విత్తం అన్యుల పాలైతే ఆ ధనం వల్ల అతనికి ప్రయోజనం ఏముంది? జీవితాంతం కష్టించి ఆ కష్ట ఫలాన్ని తాను అనుభవించకుండా, పరులకు కట్టబెడితే లాభమేముంది? సర్వసుఖాలూ త్యాగం చేసి కూడబెట్టిన సొమ్మును తాను అనుభవించకపోతే అలా సంపాదించుకొన్నవాడు ఇక పొందే సౌఖ్యం ఏముంది? ప్రపంచాన్నంతా సంపాదించుకొని అనుభవించలేకపోతే దానివల్ల లాభమేముంది? ఇటువంటి వారిని, ఇటువంటి పరిస్థితులనే ఈ బైబులు సామెత కూడా వ్యక్తపరుస్తున్నది.

'దానము, భోగము, నాశము పూనికతో మూడుగతులు భువిధనమునకున్, దానము, భోగము నెరుగని, దీనుని ధనమునకు తృతీయమే (నాశమే) గతి' అంటాడు భర్తృహరి తన సుభాషితాలలో, ఈ తెలుగు సామెత, బైబులు సామెత కూడా ఇదే సత్యాన్ని బోధిస్తున్నాయి.

10. తెలుగు సామెత: అబద్ధాలాడితే ఆడపిల్లలు పుడతారు.

బైబులు సామెత: అబద్ధములు ఆడకుము (కీర్తనలు 34:13)

వేమన సూక్తి

'కల్లలాడు కంటె కష్టంబు మరిలేదు
కష్టమెపుడొ కీడు కలుగజేయు
ద్విజదననుట చూడ త్రిమ్మరితనమురా'.

సత్యవాక్పరిపాలనం సాటిలేని ధర్మం. మహాత్ములకు ఐశ్వర్య లేమిచేత ఆభరణాదులు లేకపోయినప్పటికీ హస్తాలకు సత్పాత్రదానము, శిరానికి గురుపాద నమస్కృతి, తదితర అలంకరణలతో పాటు 'ముఖంబున సూనృతవాణి' శోభనిస్తుందని భర్తృహరి ఉవాచ. పై రెండు సామెతలూ అనృతాన్ని గర్హిస్తున్నాయి.

పురుషాధిక్య సమాజాలలో నాటికీ నేటికీ కూడా ఆడపిల్లను కని పెంచి ఒక అయ్య చేతిలో పెట్టేవరకూ తల్లిదండ్రుల వెతలు చెప్పశక్యం కాదు. ఇది దుర్భరమనీ, శాప ఫలితమని ఎంచడం అనాదిగా వస్తున్నది. అందుకే అబద్ధాలాడితే ఆడపిల్లలు పుడతారనే శిక్ష ద్వారా అబద్ధాలాడటాన్ని గరిస్తున్నది తెలుగు సామెత. దీనినే వేమన నొక్కి వక్కాణిస్తూ నేను ద్విజుడిని, అబద్ధాలాడినా నాకేమీ నష్టం కలగదు అనడం బుద్ధిహీనమంటున్నాడు.

'సత్యం వద, ధర్మం చర' అనేవి సర్వకాలీన సత్కర్మలు. బైబులు సామెత దీనినే

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

సమర్థిస్తున్నది. సాలోమోను. రాజేంద్రుని సూక్తుల్లో లెక్కకు మిక్కిలిగా అబద్ధాలను గర్హించేవి కనిపిస్తాయి. యూద, క్రైస్తవ ధర్మశాస్త్రానికి ఆయువుపట్టుగా ఉన్న దశాజ్ఞలలో ఒకటి నీ సాటి వ్యక్తిని గురించి అబద్ధ సాక్ష్యం పలుకకూడదన్నది (నిర్గమకాండము 20:16), అబద్ధాలాడేవాడు. సైతం ఇతరులు తనతో సత్యమే పలకాలని కోరుకుంటాడు. చిల్లికుండలో నీరు నిలువని రీతిగా అసత్యాలాడే వారి ఇంట లక్ష్మి ఉండదని పెద్దలు అంటారు. అసత్యవాది అనేక ఈతి బాధలపాలౌతాడు. సాటివారు అతనిని నమ్మరు. అలాటి వ్యక్తికి దూరంగా ఉంటారు.

మనమాచరించిన కర్మలన్నిటికీ తగిన ప్రతిఫలం అనుభవించవలసిందే. సత్యవ్రతంలో వాసికెక్కిన ధర్మరాజు ద్రోణవధకై 'అశ్వత్థామ హతః కుంజరః' అని పలికిన అనృతం ఆ మహాత్ముని వ్యక్తిత్వంలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయింది.

11. తెలుగు సామెత: అరగడియ భోగం, ఆరు నెలల రోగం. సంకటాల విత్తు సానిదాని పొత్తు. మీద మెరుగులు లోన పురుగులు

బైబులు సామెత: వేశ్యలను కూడువాడు కుళ్ళుపట్టి పురుగులు పడి చచ్చును. (సీరా 19:2,3).

వేమన

'తొత్తుతోడి పొందు తొర్రి పెసలమూట.
లంజెతోడి పొందు లజ్జ చెడుపు.
జాండ్రతోటి పొందు చావునకేయగు' అంటాడు.

సమాజం స్థూలంగా అన్నవస్త్రాదులకు లోటులేని స్థితిలో కొనసాగుతున్నప్పుడు సాహిత్యాది లలిత కళలు కుసుమిస్తాయి. ఇటువంటి అభిలషణీయమైన నాగరికతా చిహ్నాలతో బాటు వేశ్యావృత్తి అనే జాడ్యం కూడా అలాటి సమాజంలో పొడచూపుతుంది, విషయవాంఛలకై విత్తాన్ని వెదజల్లగల విటులున్నచోట పేటలకు పేటలు వారకాంతలుంటారు. వేశ్యల తోడి పొందులోని అనర్థాలను తెలుగు సామెతలు, బైబులు సామెతా మొగమాటం లేకుండా ప్రకటిస్తున్నాయి.

వెలయాలి తళుకుబెళుకుల అత్తరు ఘుమఘుమల తమకంలో పడి పురుషులు కామాతురులై దీపశిఖ చుట్టూ మూగే శలభాల వలె వారి పొందుకు తపిస్తారు. ఆ సుఖానుభవం మూణ్ణాళ్ళ ముచ్చటేయని వారు గ్రహించరు. తనను నమ్ముకొన్న ఇల్లాలికి, పిల్లలకు అన్యాయం చేస్తూ, అయినవారిచే మాటలు పడుతూ, ఇల్లు గుల్లచేసుకొంటూ వేశ్యాలోలత్వంలో మగ్గిపోతారు.

నోటికి రుచిగా ఉన్నది గదా అని పంచభక్ష్య పరమాన్నాలూ ఆత్రుతగా భుజించి ఆరు నెలలు అజీర్తి వాతాలతో మంచాన పడ్డ చందాన ఉంటుంది సానిదాని పొందు, తెలుగు సామెతల సారాంశం ఇదే.

బైబులులో మహాబలుడు సంసోను డెలీలా అనే

వేశ్య పంచన చేరి సకల విధాలా భ్రష్టుడైన గాథ లోక ప్రసిద్ధం. బైబులు సామెత వేశ్యాగమనంలోని అనర్థాలను బహు కటువుగా చెబుతున్నది. వెలయాలంటే వెల వెల చెల్లిస్తే తాత్కాలికంగా అలిగా ఉండే స్త్రీ సాధారణంగా ఆమె శరీరం రోగాల పుట్ట. అమెను కూడేవాడికి అవన్నీ మెడకు చుట్టుకుంటాయి. ప్రాణాంతకం కాకపోయినా భరించరాని బాధ కలిగించే వ్యాధులు కొన్నయితే, అనతి కాలంలోనే అసువులను హరించివేసే ఎయిడ్స్ వంటివి మరికొన్ని మొత్తం మీద వేశ్యాలోలత్వం అన్నివిధాలా అనర్థదాయకమని గమనించమంటున్నాయి. ఈ సామెతలు వేమన పద్యాలలో ఈ ప్రస్తావనలు తరచుగా వస్తుండడాన్ని బట్టి అతడు తన యవ్వనంలో వేశ్యల విషయంలో అనుభవం గడించి ఉంటాడని పండితుల అభిప్రాయం. విటుని వద్ద ధనమున్నంత కాలం ఇచ్చకాలాడుతూ ఉండడం, అతని ఇల్లు, ఒళ్ళు గుల్ల అయిన తరువాత సానిదాని తల్లి అతనిని మెడబట్టి గెంటడం వేమన పద్యాలలో వ్యక్తమవుతూ ఉంటుంది.

'బొల్లిమాటలాడు భోగము దానితో
దొల్లి డుల్ల విల్లు గుల్లచేజి
వెళ్ళి రమ్మటంచు వెడలించునింటిని.

బైబులులోని సామెతలు గ్రంథమంతటా జారణికి మారంగా ఉండమన్న ఉద్బోధలున్నాయి. అలానే మన తెలుగు సామెతలలో కూడా లెక్కకు మిక్కిలిగా భోగము దానితో పొందు కూడదన్న హెచ్చరికలు, హితవులు ఉన్నాయి. అందుకే భోగందాని వలపూ, బొగ్గు తెలుపూ లేవంటారు.

12. తెలుగు సామెత: అలి మీద లంజరికము ఆకలిగాని భోజనము

బైబులు సామెత: భార్యను శంకించకుము (సీరా 9.1)

వేమన

పురుషుభాగ్యముననే పుణ్యవతి దొరకు
పుణ్యవతికి నట్టె పుట్టు సుఖము
నిరువురp◌ుభవింప హితులును పుత్రులు
అష్టభోగములుసు అమరు వేమ'

భార్యాభర్తల మధ్య ఉండే అనుబంధానికి లోకంలో మరేదీ సాటిరాదు. ఆ అనుబంధానికి ఆయువుపట్టు నమ్మకం.

స్త్రీ పురుషులు తమ కాపురంలో కలిసి అనుభవించే మిట్టపల్లాలు, వెలుగు నీడలు, కష్టసుఖాలు వారిద్దరి మధ్య వారికే తెలియని ఒకానొక అనిర్వచనీయమైన మానసిక బంధాన్ని ఏర్పరుస్తాయి. ఇద్దరికీ రెండు శరీరాలు గానీ, మనసొక్కటి అత్య ఒక్కటే. 'నాతి చరామి' అని ఒకరితో ఒకరు ప్రమాణం చేసుకొన్నప్పుడే వారిద్దరూ ఏకమైపోయారు. క్రైస్తవ సంప్రదాయంలో పురుషుని శరీరం అతని భార్య, భార్యకు శిరస్సు భర్త అని నమ్ముతారు. ఒకరి భార్య అతని మాట వినడం లేదంటే అతని అవయవాలలో ముఖ్యమైనది మొరాయించి అతనికి

అనువుగావడం లేదని అర్థం, భార్యగానీ, భర్తగానీ తప్పటడుగు వేస్తే ఆ పాపంలో ఇద్దరినీ భాగం.

తనమీద తనకు నమ్మకం లేని వ్యక్తి తన భార్యను సందేహిస్తాడు. దారి తప్పిన పడతులు నూటికి కోటికొక్కరు తప్పించి ఏ ఆడదీ చేజేతులా కాపురాన్ని పాడుచేసుకొని అక్రమ సంబంధాలకు ఒడిగట్టదు, సంసారమంటే. ఉత్తి పుణ్యానికి ఒకరినొకరు శంకిస్తూ బ్రతుకును నరకం చేసుకొనే దంపతులుంటారు.

అందుకే బైబులులో కూడా భార్యను శంకించరాదన్న ఉవాచ ఉన్నది. అది సామెతగా స్థిరపడింది. నమ్మకం అనేది చెడితే భర్త నోట అటువంటి అనుమానం వెలువడితే అభిమానవతుల బాధ వర్ణనాతీతం, ఒకసారంటూ పురుషుడు తన భార్యకు రంకుతనం అంటగట్టిన తరువాత ఇక వారిద్దరి సంబంధం ఎన్నటికీ గతంలోవలె ఉండదు. పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడంతటివాడు తాను నమ్మకపోయినా లోకాపవాదులకు వెరచి శీలవతి కాదన్న నిందవేసి సీతను కానలకు పంపించాడు. ఆ సాధ్వి ఇక జీవితంలో ఎన్నడూ భర్తను చేరలేదు. భార్యాభర్తల అనుబంధం బహు సున్నితమైనది.

అన్యోన్యంగా పరస్పరం అభిమానించుకొంటూ, సన్మానించుకొంటూ గడిచిపోయే కాపురం భూతల స్వర్గం, కడివెడు పాలలో ఒక్క విషపు చుక్క చందాన అనుమానం పెనుభూతమై మనసులో తిష్టవేసుకున్నదంటే ప్రణయం ప్రళయంగా పరిణమించక తప్పదు అని ఈ సామెతల నుండి గ్రహించవచ్చు.

13. తెలుగు సామెత: బలవంతమైన

సర్పము చలిచీమల చేత జిక్కి చావదె.

బైబులు సామెత: పొగరుబోతునకు అవమానము తప్పదు (సామెతలు 11:2 16:18).

వేమన సూక్తి

లక్ష్మి యేలినట్టి లంకాధిపతి పురి
పిల్ల కోతి పౌజు కొల్ల పెట్టెఁ
జేటు కాలమయిన జెఱుప నల్పులె జాలు
విశ్వదాభిరామ! వినురవేమ!

గొప్ప ధనవంతుడైన రావణుని లంకను సామాన్యమైన కోతులు నాసనము చేసెను. చెడ్డకాలము వచ్చినప్పుడు సామాన్యులైనను అపకారము చేయుదురు.

యౌవన మదంతోనో, బలగర్వంతోనో, కలిమి వల్ల కలిగిన కైపుతోనో పదుగురిని దూషిస్తూ తిరస్కరిస్తూ చరించడం. దుర్గుణమనీ, నాశహేతువనీ ఈ సామెతలు హెచ్చరిస్తున్నాయి. 'బలవంతుడ నాకేమని పలువురితో నిగ్రహించి' పలకడం వల్ల తనకు హాని కలిగించుకొంటున్నాడు. అలాటి పొగరుబోతు కాలం దాపురించినపుడు అల్పజీవుల చేతిలో భంగపడతాదని ఈ సామెతల సారాంశం. వేమన కూడా ఏకీభవిస్తున్నాడు-

'లక్ష్మి' యేలినట్టి లంకాధిపతి పురి పిల్ల కోతి సేన

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

కొల్లబెట్టె'

కాలం కలిసి రాకుంటే ఘనులు సైతం అల్పులౌతారు, మట్టి కరుస్తారు, ఇశ్రాయేలులో సింహబలుడు సంసోను చరిత్ర లోకప్రసిద్ధం. అతని చారుకేశ విలాసగాథ విషాదాంతం. తన కండబలంతో అహంకరించి కన్ను మిన్ను కానక శత్రుసీమలో వేశ్య పంచన చేరాడు. దేవుని పవిత్రాజ్ఞను నిర్లక్ష్య పెట్టి తన కేశ ఖండన రహస్యాన్ని శత్రువులకు అందే పరిస్థితిని కొనితెచ్చుకున్నాడు. తుచ్ఛులు, అర్భకులు అయిన శత్రుమూకల చేజిక్కి నిస్సహాయుడై కంటిచూపు పోగొట్టుకొని బానిస తొత్తుగా మారాడు. రావణ బ్రహ్మాదీ అదే ధోరణి, లంకాపురి అభేద్యమనీ, తన భృత్యులు అనితర సాధ్య పరాక్రమశాలురనీ, తాను ఈశ్వర వరప్రసాదిననీ గర్వించి కానిపనులకు పాల్పడ్డాడు. చివరికి వానరుల వంటి అల్పజాతి లంకకు చేటు తెచ్చిపెట్టింది.

ఎంత బలమైన కాలసర్పమైనా చలిచీమల దండు తన దేహంపై దాడి చేసినపుడు చురుకుగా విదిలించుకొని సురక్షిత ప్రదేశానికి వెళ్ళకుండా, మన్నుదిని మత్తుగా పడియుండి, ఈ అల్పజీవులేమి చేస్తాయిలే అని అహంకరిస్తే వేలకొలదిగా చలిచీమలు దానిని లొంగదీసుకొని ప్రాణాలు తోడి తమకు ఆహారంగా చేసుకుంటాయి. ఎంతటివారికైనా అహం పనికి రాదని ఈ దృష్టాంతాల ద్వారా నేర్చుకోవచ్చు.

బొట్టు బొట్టుగా పడే నీటి బిందువులు ఎట్టకేలకు కఠిన పాషాణాన్ని సైతం కరగతీస్తాయి. బలగర్వమున్నవాడు. అవమానాలను కొనితెచ్చుకుంటాడని ఈ సామెతల ఉపదేశం.

14. తెలుగు సామెత: సేద్యగానికీ / జీతగానికీ మగబిడ్డా?

బైబులు సామెత: సౌలు కూడా ప్రవక్తలలో చేరెనా? (1 సమూయేలు 10:12)

వేమన

'చక్కదనము లేల సంపదలేలను
విద్యయేల? భూమి విరివియేల
పుత్ర - పదవికన్న పుట్టునా పదవులు?
విశ్వదాభిరామ వినుర వేమ

వేమన వాక్రుచ్చిన రీతిగా పుత్ర సంతానం అదృష్టభాగ్యంగా ఎంచే సంస్కృతి మనది. ఒక భూస్వామికి వరుసగా ఆడపిల్లలే పుడుతున్నారు. అతని వద్ద పనిచేసే పాలేరుకు కొడుకు పుడితే ధనికుడైనప్పటికీ ఆ యజమాని తన బంటుపై ఈర్ష్య చెందడం సహజం. లోకులది ఒక విచిత్రమైన మనస్తత్వం. సహజంగా దక్కే పరాలైనా పేదకు అలాటివి లభ్యమైనపుడు ఈసడించుకొంటూ, ఈర్ష్య చెందేవారుంటారు. ధనికులకు సిరిసంపదలు, అదృష్టాలు పోగులు పడినా, వారికేమి, మారాజులు, వారికిగాక మరెవరికి దక్కుతాయి ఇలాటివి అంటూ అబ్బురపడడం లోక సహజం,

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

తెలుగు సామెత ఈ కోవకు చెందిన మానవ స్వభావాన్ని వర్ణిస్తున్నది.

ఇక బైబులు సామెత నేపథ్యం ఆసక్తికరమైనది. ఇశ్రాయేలు వారు దైవస్వామ్య వ్యవస్థతో విరక్తి చెంది ఇతర జాతులవలె తమకూ రాజుండాలని పట్టుపట్టారు. వారి మధ్య దైవప్రతినిధిగా ఉన్న సమూయేలు ప్రవక్త దైవాజ్ఞ ప్రకారం సౌలు అనే యువకుణ్ణి రాజుగా తైలంతో అభిషేకించాడు. దైవ నిర్ణయం జరిగిపోయింది. ఇక ప్రజలే అతణ్ణి రాజుగా గుర్తించాలి. ఈలోగా ఒక విచిత్రం జరిగింది. అభిషిక్తుడైన సౌలుపై దైవాంశ, దైవాత్మ నిలిచి ఉన్న కారణాన అతడొక పర్యాయం దైవజ్ఞులున్న వాటికలో వారితోబాటు ఉన్నాడు. పరవశులై వారంతా దేవోక్తులు పలుకుతూ ఉన్న సమయంలో సౌలు సైతం ఆత్మవశుడై ప్రవచనాలు పలికాడు. ఈ వైనం ఆనోటా ఈనోటా ప్రజానీకంలో వ్యాపించింది. సౌలు నెరిగినవారికి అతడు ఆధ్యాత్మిక చింతన గలవాడు కాదని బాగా తెలుసు, వారు కొంత ఎక్కసంగా, కొంత ఆశ్చర్యంగా, హాస్యాస్పదంగా, ఏమి? సౌలు కూడా ప్రవక్తలలో చేరాడా?' అంటూ ప్రశ్నిస్తూ నవ్వుకొన్నారు.

సాధ్యమా అసాధ్యమా అన్న మీమాంసతో పనిలేకుండా, ప్రజల అభిప్రాయంలో దేనికైనా ఒక వ్యక్తి అర్హుడా కాదా అన్న దృష్టితో పలికే మాటలకు ఈ సామెతలు ప్రతినిధులు.

మొత్తమ్మీద తెలుగు, బైబులు సామెతలు రెండూ కల్ల నిజాలెరుగని సామాన్య జనులు వారి అభిప్రాయలను బట్టి హాస్యానికో, ఈసడింపుకో చేసే వ్యాఖ్యానాలు.

15. తెలుగు సామెత: గొడ్డుటావు పాలు పితికినట్లు

బైబులు సామెత: పిసినారియైన నరుడు దుష్టుడు, అక్కరలో ఉన్నవారిని ఆదుకొనడు (సీరా 14:10).

వేమన సూక్తి

'గొడ్డుటావు బిదుక కుండ చేకొనిపోవ
పళ్లనూడదన్ను, పాలనీదు;
లోభివాని నడుగ లాభంబు లేదయా'

పాలనివ్వడం క్షీరదాల సహజ గుణం. ఇది క్షీరద సంతానానికీ, మానవులకు కూడా ఉపయోగకరమైన లక్షణం! అయితే కొన్ని గొడ్డుబోతు పశువులుంటాయి. అవి పాలీయవు. ఎందుకంటే పిల్లలను కని, పాలిచ్చి పెంచే శక్తి సామర్థ్యాలు వాటికి ఉండవు కనుక, ఇది అవులకు సంబంధించిన విషయం. దీనిని మానవులకు అన్వయించుకుంటే పిసినారి గొడ్డుటావుతో సమానుడు. అతనిని ఆశ్రయించడం వల్ల గాని యాచించడం వల్ల గాని ఎటువంటి ప్రయోజనమూ ఉండదని భావం. ఇటువంటి సందర్భాలలో ఈ తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులు సామెత కూడా దీనికి సమానార్థకమైనదే.

పిసినారి దుష్టుడు. అతడు అక్కరలో ఉన్నవారిని ఆదుకొనడు. అటువంటివాని వలన ఏ ప్రయోజనమూ ఉండదు. గొడ్డుటావు వలన పాడికి సంబంధించిన ప్రయోజనాలు ఎలా ఉండవో, అలాగే ఈ పిసినారి వల్ల కూడా ఆపదలో ఉన్నవారికి, అక్కర కలిగినవారికి ఏ విధమైన ఉపయోగమూ ఉండదు.

ఎవరికీ ఉపయోగపడని జీవితం మృతప్రాయం, అటువంటి సందర్భాలను వివరించడంలో పైన చెప్పిన తెలుగు సామెత, బైబులు సామెతలు ఒకే విధంగా ఏకార్థంతో ప్రయోగింపబడతాయి. అక్కరలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ లక్షణం. ఎదుటివానికి సాయపడని జీవితం మోడువారిన చెట్టూ సమానమే.

16. తెలుగు సామెత: చేసుకున్నదానికి మూసుకోను లేదు. ఉంచుకున్నదానికి ఉభయరాగాల చీర.

ఆలుబిడ్డలు అన్నానికి అలమటిస్తుంటే లంజకు బిడ్డలు లేరని రామేశ్వరం పోయినట్టు.

బైబులు సామెత: సొంత కుమారులు ఆకలితో అలమటించుచుండగా తండ్రి తన ఆస్తిని మిత్రులకు పంచి ఇచ్చినట్లు (సామెతలు 17:5)

వేమన సూక్తి

ఆలు రంభయైన నతిశీలయైన
జారపురుషుడేల జాడ మాను
మాలవాడ కుక్క మరగినచందంబు
విశ్వదాభిరామ వినర వేమ.

జారుడు సిగ్గుమాలి దాంపత్య జీవన ధర్మాన్ని వీడి పరనారీ సంగమానికై వెంపరలాడుతాడు. ఆలుబిడ్డలు అన్నమో రామచంద్రా అని అలమటిస్తుంటే తన జల్సాలకు యథేచ్ఛగా ధనవ్యయం గావించే, ముఖ్యంగా ఉంపుడుగత్తెలకు దోచిపెట్టే గ్రంధసాంగులకు చెంపపెట్టుగా పైని చెప్పిన తెలుగు సామెతలు పుట్టాయి.

'ఆలు రంభయైన నతిశీలవతియైన జార పురుషుడేల జాడమాను" అంటూ వ్యభిచారి సహజ స్వభావాన్ని ఎండగట్టాడు వేమన, వేడి తగిలితే లక్క కరిగినట్టు కాముకుడు వేశ్యను చూచి మోహంతో కరిగిపోతాడు. వెలదుల పాలబడితే వెతలు తప్పవు. అగ్నిసాక్షిగా మనువాడిన అర్ధాంగిని, తాను కడుపారా కన్న బిడ్డలను సైతం విస్మరించి తన కనుసన్నల్లో మగవాడు మెలిగేలా చేసుకుంటుంది వారకాంత, 'నాడెమైన చెడిపై సయమెరింగి తిరుగు విటుని గుస్తరించు వివరమెరుగు'

అధమ పురుషులలో కనిపించే ఈ చపలత్వాన్ని ఎత్తి చూపుతూ తెలుగు సామెతలు రెండూ ఉనికిలోకి వచ్చాయి. అలాటివాడు వేశ్యకు సమస్తం సమర్పించుకొని ఇల్లు గుల్ల చేసుకొని భ్రష్టుడౌతాడు. గోడకి పూసిన సున్నం తిరిగి రానట్టు వెలయాలకు ఎంత ఇచ్చినా ఆమె వలన తాత్కాలిక శరీర సుఖమే గాని శాశ్వత సౌఖ్యం లేదు.

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

'ఔరసుండె నీకు వారస్తుండగు గాక
వేశ్యయందు పుట్టు వెధవ కొడుకు
నీవు పోయినపుడు నీరైన వదులనా

అంటూ అటువంటి నీచ ప్రవర్తనను వేలెత్తి చూపుతున్నాడు వేమనాఖ్యుడు. బైబులు సామెత సైతం కొంత భిన్నమైన మాటలతో ఇదే సత్యాన్ని ప్రతిపాదిస్తున్నది. గృహస్తు తన కుటుంబ పోషణ బాధ్యత మరిచి పరులకు తన ధనం దోచిపెట్టగా తనూజులు ఆకలికి అలమటించడం సహింపరాని నేరం, 'చీట్లపేక ఖండికలో జాషువా కవి ఇలాటి మనస్తత్వమున్న మగవారి మనోభావాలు చక్కగా వర్ణించాడు. 'అనుంగు బిడ్డడు బావిలో బడియెనన్నా! లేచిరమ్మన్న, తెచ్చునదీ మార్గమె కాయటంచు వచించున్ జూదగాడు' అంటూ 'పేకయాట గుండె పీకులాట' అని తేల్చాడు కవి. కష్టాలలో ఉన్న తమవారిని గురించి పట్టించుకోకుండా వేశ్యల కోసం, మిత్రుల కోసం డబ్బును వెచ్చించే డాంబికులను భర్తలనుగా, తండ్రులనుగా పొందినవారు దురదృష్టవంతులే కదా!

17. తెలుగు సామెత: కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?

బైబులు సామెత: కొందరు మితముగా మాటలాడుటచే జ్ఞానులనబడుదురు. కొందరు అమితముగా మాటలాడుటచే చెడ్డపేరు తెచ్చుకొందురు (సీరా 20:5).

వేమన

'అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినుమర వేమ

ఈ పద్యంలో అల్పుడు గణగణ మ్రోగే కంచుగాను, సజ్జనుడు చల్లగా మెల్లగా మ్రోగే కనకంగాను పోల్చబడ్డారు. కంచునకు వట్టి శబ్దాడంబరమే గాని పదార్థం విలువ లేనిదని, కనకానికి శబ్దాడంబరం లేకపోయినా, వస్తువు విలువైనదని చెబుతారు, అల్పుడు కంచుతోను, సజ్జనుడు కనకంతోను పోల్చబడి ఈ పద్య సామెత ఉపమాలంకార శోభితంగా సాగింది. బాహ్యాంతరార్థాలకు సుందరమైన పోలిక కుదిరింది!

బైబులులోని సీరా జ్ఞానగ్రంథం 20వ అధ్యాయం సమయాసమయాల తారతమ్యం, మితామితాల విలువలను వివరిస్తుంది, ఎప్పుడూ (ఎల్లప్పుడూ) మాట్లాడడంచేత కొందరు అజ్ఞానులనిపించుకుంటారు. ఎప్పుడు (ఏ సమయంలో) మాట్లాడవలెనో తెలిసి, ఆ సమయం వచ్చేవరకు మౌనంగా ఉండి సమయోచితంగా మాటలాడి కొందరు జ్ఞానులనిపించుకుంటారని తెలియజేశారు. తెలుగు సామెతలో కూడా 'అల్పుడు O ఎప్పుడు' అనగా అల్పుడు ఎల్లప్పుడూ ఆడంబరంగా పల్కుతాడు అనే అర్థాన్ని గ్రహిస్తే బైబులులోని సామెత, తెలుగు సామెత సమానార్థకాలని చెప్పవచ్చు.

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

సమయోచితంగా పలికిన మాట వెండి పళ్ళెరములో నుంచిన బంగారు పండ్లవంటిది, సమయోచితముగా మాటలాడుట నేటితో ముద్దిడినట్లుండును మొదలైన బైబులు సామెతలు ఇదే భావాన్ని చెబుతున్నాయి.

18. తెలుగు సామెత: ఉత్తర కుమార ప్రజ్ఞలు

బైబులు సామెత: నరుడు వాగ్దానము చేసియు వస్తువులను ఇయ్యకుండుట, మబ్బు గాలి ఆర్భాటము చేసియు వాన కురియకుండుట వంటిది (సామెతలు 25:14).

వేమన సూక్తి

గొడ్డుటావు బితుక గుండ గొంపోయిన
పళ్లనూడ దన్ను పాలనిడదు
లోభివాని నడుగ లాభంబు లేదయా
విశ్వదాభిరామ వినురవేమ.

కొందరు అది చేస్తాను, ఇది చేస్తాను. నా యంతవాడు లేడని బడాయిలు పల్కుతారు కాని క్రియ ఆ బడాయిలకు తగినంతగా ఉండదు. "తుస్" మని తేలిపోతాయి కార్యాలు! ఈ సందర్భంలో "అంత ఉరిమి ఇంతేనా కురిసేది" అనే తెలుగు సామెతను ప్రయోగిస్తారు. “ఉత్తర ప్రగల్భాలు" అనేవి తెలుగువారికి సుపరిచితాలే. ఉత్తర గోగ్రహణంలో విరాటరాజు కుమారుడైన ఉత్తరుడు ఎన్నో ప్రగల్భాలు పలుకుతాడు. తనకంటే వీరుడు ఇకలేనే లేనట్లు కోతలు కోస్తాడు. తీరా కౌరవ సేనను చూచి వణికిపోతాడు. అదుగో అదీ ఈ మేఘాల వరుస! అందుకే వేమన "పెట్టిపోయలేని వట్టి బీరములేల?" అని అంటాడు. "వట్టి గొడ్డుకు అరుపు లెక్కువ" అనే సామెత కూడా ఇదే భావాన్ని స్ఫురింపజేస్తుంది. ఇక బైబులు సామెతలో వాగ్దానం చేసి, వస్తువులను ఇవ్వని వ్యక్తిని ఉపమేయం గానూ, ఆర్భాటం చేసి వర్షింపని మేఘాన్ని ఉపమానంగానూ పోల్చి అత్యంత రమణీయంగా చెప్పారు. అంటే క్రియాశూన్య వచనాల వల్ల ఫలితం లేదని భావం. మేఘాన్ని ఉద్దేశించి చెప్పిన తెలుగు సామెత, నరుని ఉద్దేశం చెప్పిన బైబులు సామెతల యొక్క అంతరార్థం ఒకటే! ఎటొచ్చీ వాటిని అర్థం చేసుకొని, తదనుగుణంగా నడుచుకోవడంలోనే మానవుని విజ్ఞత దాగి ఉంది.

19. తెలుగు సామెత: పెదవుల పైన తేనె, మనసులో విషం.

బైబులు సామెత: దుష్టునకు పెదవులు మీద తేనె, హృదయములో విషముండును. (సామెతలు 12:16)

వేమన సూక్తి

వేషధారినెపుడు విశ్వసింపగరాదు
వేషదోషములొక విధయె యగును
రట్టుకాదె మునుపు రావణు వేషంబు
విశ్వదాభిరామ వినుర వేమ!

దుష్టులకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తూ చెప్పిన సామెతలు, సూక్తులు కోకొల్లలు, అందునా

ప్రత్యక్ష శత్రువైతే పరవాలేదు. పైకి ప్రేమ నటిస్తూ లోపల ద్వేషించేవారి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి.

ఇలాటి కాపట్యం మనుషులకే స్వంతం, జంతువులకు ఇది చేతకాదు. తోక తొక్కిన తాచు పడగ విప్పి చివాలున లేస్తుంది. కుక్క తన కోరలు చూపిస్తూ మొరుగుతూ పైన బడుతుంది. మనస్సులో క్రోధముంచుకుని పైకి ప్రేమ నటించే శక్తి జంతు జాలానికి లేదు.

మనుషుల్లో పయోముఖ విషకుంభాలుంటారు. పైకి ఇచ్చకాలు పలుకుతూ లోలోపల ఎదుటివాడినెలా కూల్చాలా అని పన్నాగాలు పన్నుతుంటారు. మహా భారతంలో శకునిది అదే బుద్ధి అని ఒక వాదన ఉంది. అతడు కౌరవ వంశ పతనాన్ని ఆశించి దుర్యోధనుని పంచన చేరాడనీ, వారి వైపునున్నట్టు నటిస్తూ, వారి చేత కానిపనులన్నీ చేయిస్తూ చివరికి వంశమంతా అంతరించిపోవడానికి కారణమయ్యాడంటారు.

ఇలాటివారి కుటిల బుద్ధులెరుగక అమాయకులు అతని పతనం కళ్ళారా చూద్దామని ఆశించే దుష్టుడు అతనిని ఆ చెడు మార్గంలో ప్రోత్సహిస్తాడు. సదసద్వివేచన గలిగిన వ్యక్తి ఎవరు తనవారో ఎవరు పగవారో పరిశీలించి మసలుకోవాలి. తెల్లవన్నీ పాలు కావు, నల్లవన్నీ నీరూ కాదు అని ఈ సామెతలు తేటతెల్లం చేస్తున్నాయి.

వారి మాయమాటలకు మోసపోయి వారిని నమ్మి అక్కున చేర్చుకొని అసలు రంగు బయటపడినప్పుడు నివ్వెరపోతుంటారు.

"వేషధారినెపుడు విశ్వసింపగరాదు వేషదోషము లోక విధమెయగును రట్టుకాదె మునుపు రావణు వేషము' అన్నాడు వేమన.

పెదవులపై తేనె, మనసులో విషం పెట్టుకున్నవారు ఎంతటి మారువేషం ధరించినా అనతి కాలంలో గుట్టు రట్టు కాకమానదు. లోపలున్నదే నిజం. ముఖానికి పులుముకున్నది వేషం మాత్రమే అసలు రంగు బయటపడకమానదు.

స్నేహితుడు మేలు కోరి గాయములు చేయును, పగవాడు లెక్కలేనన్ని ముద్దులు పెట్టును అని బైబులు సెలవిస్తున్నది. మనిషిలో తప్పులు ఉండకమానవు. శ్రేయోభిలాషులు అతని మేలుగోరి అతనిని గద్దించి సరిదిద్దాలని చూస్తారు. ఆ వ్యక్తిని ఆ మురికి కూపంలోనే ఉంచి చివరకు

20. తెలుగు సామెత: పెంటమీద రాయి వేస్తే ముఖమంతా చిందుతుంది.

బైబులు సామెత: మూర్ఖుని మందలించువాడు నవ్వుల పాలగును, దుష్టుని హెచ్చరించువాడు అవమానములు కొనితెచ్చుకొనును (సామెతలు 9:7)

వేమన

'చాకి కోకలుదికి చీకాకుపడజేసి

మైల దీసి లెస్స మడచినట్లు
బుద్ధి చెప్పువాడు గుద్దిన నేమయా'

వేమన పలికిన ఇలాటి హితవులు మూర్ఖులకు రుచించవు. దుష్టుడు అహంకరించి ఊరంతటినీ పీడిస్తూ విశృంఖల విహారం గావిస్తుంటాడు. అలాటివాడికి బుద్ధి నేర్పబూనుకుంటే ఎంతటి వారన్నది చూడకుండా వారిమీదే తిరగబడి దుర్భాషలాడడం వాడి నైజం.

సుయోధనుని కొలువులో విదురాది నీతికోవిదులు, భీష్మాది కురువృద్ధులు, ద్రోణాది గురుపుంగవులు ఎంతమంది. హితవు పలికినా, వాసుదేవుడు పనిగట్టుకుని వచ్చి హెచ్చరించినా వారికి కంఠశోష, తిరస్కారమే మిగిలింది.

తెలుగు సామెత ఇలాటివారిని మందలించడం వ్యర్థమనీ, పైగా అది మండలించబూనుకున్న వానినే నవ్వులపాలు చేస్తుందనీ బహు నిష్కర్షగా, నిశితంగా తెలుపుతున్నది. బైబులు సామెత కూడా దుష్టుని క్షేమమాశించి నాలుగు మంచి మాటలు చెబితే మనకే తలవంపులు ఎదురవుతాయనే లోక ప్రసిద్ధ సత్యాన్ని సూటిగా వ్యక్తపరచింది.

ముళ్ళ కంచెపై మేలిమి చీనీ చీనాంబరాన్ని ఆరవేస్తే దానిని తిరిగి తీసే సమయంలో అది చినగక మానదు. నీటిలో కొట్టుకుపోయే తేలును చేతులతో రక్షించడానికి ప్రయత్నిస్తే అది కుట్టక మానదు. అలానే మూర్ఖుని మనస్సు రంజింపజేయాలనే సదుద్దేశంతో సుద్దులు పలుకబూనుకుంటే అవమానం తప్పదు.

తెలుగు సామెత మూర్ఖుని జోలికి వెళితే అవమానం కలుగుతుందని చెబితే, బైబులు సామెత మూర్ఖునికి మంచి చేయబోయినా అవమానం కలుగుతుందని చెబుతున్నది. మంచికిపోతే చెడు ఎదురయిందన్నట్టు దుర్మార్గునికి హితవు చెప్పబోతే మనకి మిగిలేది తిరస్కారమే, మేలుకోరి పూనుకుని అజ్ఞానిని మంచి మార్గంలోనికి తేవాలని పోయినవాడు. చెంపలు వేసుకొనే పరిస్థితి వస్తుంది. 'పోగాలము దాపురించిన వాడు కనడు, వినడు, మూర్కొనడు' అని నీతిచంద్రిక సూక్తి, రావణబ్రహ్మ కొలువులో ప్రధానులంతా సీతాపహరణాన్ని సమర్థించారు. నీతికోవిదుడు, సాధుజీవి అయిన విభీషణుడు మాత్రం ముంచుకు రానున్న వంశ నాశనాన్ని ఊహించి అగ్రజునికి మంచి మాటలు చెప్పబూనుకున్నాడు. ఫలితం ఛీత్కారం, దేశ బహిష్కారం, శత్రువుతో చేయి కలిపాడన్న అపకీర్తి. ఇది మూర్ఖుల తీరు.

## ఉపయుక్త గ్రంథాలు

కోదండరామరెడ్డి, మరుపూరు. లోక కవి వేమన, వేమన ఫౌండేషన్, హైదరాబాదు, 2005

గంగాధరం, నేదునూరి. పసిడి పలుకులు, జాతీయ విజ్ఞానపీఠం, మద్రాసు, 1960

గంగాధరం, నేదునూరి. వ్యవసాయ సామెతలు, విశ్వసాహిత్యమాల, రాజమండ్రి, 1959

గీతికా శ్రీనివాస్, టి. తెలుగు సామెతలు (సంకలనం). జె.పి. పబ్లికేషన్స్, విజయవాడ, 2002

జాను,ఎం పి. క్షమాపణ, ఎస్ & ఎస్ పబ్లికేషన్స్, సమిశ్రగూడెం, 2008.

జాషువ, గుఱ్ఱం. ఫిరదౌసి, జాషువ ఫౌండేషన్, విజయవాడ, 1996

జాషువ, గుఱ్ఱం. ఖండకావ్య సంపుటి, జాషువ ఫౌండేషన్, విజయవాడ, 1997

జోజయ్య, పూదోట. పవిత్ర గ్రంథము అనువాదము

జోజయ్య, పూదోట బైబులు భాష్య సంపుటావళి, సెయింట్ పీటర్స్ కరీడ్రల్ విజయవాడ, 2003

తులజ, పుట్టపర్తి. తెలుగు సామెతలు - సాంఘిక జీవితం! ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1985

తెలుగు పర్యాయపద నిఘంటువు సత్యశ్రీ ప్రచురణలు, , 1991

దామోదర్రావు, బి. తెలుగు సామెతలు - జానపద సంస్కృతి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1995.

తెలుగునాట జానపద వైద్య విధానాలు పండువెన్నెల ప్రచురణలు, రాజమండ్రి, 1999

నరసింహారెడ్డి, పాపిరెడ్డి. తెలుగు సామెతలు జనజీవనం. శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, 1981

నాగరాజు, బండి. సామెతలు - ఛందస్సామృతలు, భారతి, మార్చి, 1966

పోతన, బమ్మెర. శ్రీమహాభాగవతము, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1987

బద్దెన. సుమతీ శతకము, గొల్లపూడి వీరాస్వామి సన్, రాజమండ్రి, 2000

మోహన్, జి.యస్. తెలుగు, కన్నడ సామెతలు సమానార్థకాలు శ్రీనివాస పబ్లికేషన్స్, మలయనూరు, 1993

మోహన్, జి.యస్. సామెతలలో సాంఘిక జీవితం, శ్రీనివాస పబ్లికేషన్స్, మలయనూరు, 1983

రమాపతి రావు, అక్కిరాజు. తెలుగు సామెతలు - సాంఘిక జీవితం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1992

రమాపతిరావు, అక్కిరాజు. సామెతలు - పుట్టుపూర్వోత్తరాలు, అభినందన, తూమాటి

దొణప్ప. షష్టిపూర్తి సంచిక, డిసెంబరు, 1987

రాజేశ్వరరావు, పి. తెలుగు సామెతలు (సంకలనం), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2000

రాధాకృష్ణ బూదరాజు (సం). మరవరాని మాటలు, మీడియా హౌస్ పబ్లికేషన్స్, హైదరాబాదు, 2004

రామ నరసయ్య, టి.వి. తెలుగు సామెతలు - ఒక సవిమర్శక పరిశీలనము. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1994

రామరాజు, బిరుదురాజు. తెలుగు జానపద గేయ సాహిత్యము. జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు, 1978

రామాంజులు, ఎం.జె. బైబులు వ్యాఖ్యానము, పాత నిబంధన- రెండవ భాగము

రామాచార్యులు, బి. తెలుగు సామెతలు - మానవ స్వభావం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1988

లక్ష్మణకవి, ఏనుగు. భర్తృహరి సుభాషిత రత్నావళి, జె.పి. పబ్లికేషన్స్, విజయవాడ, 2006

లక్ష్మీ నారాయణ, గంగిశెట్టి (సం) తులనాత్మక సాహిత్య వ్యాసాలు, పొట్టి శ్రీరాములు. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2004

విలియం, పాటిబండ్ల. ఆంధ్ర క్యాతలిక్ బైబులు సంఘము

వీరభద్రుడు, కాలిపు. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన సామెతలు. స్రవంతి, మార్చి, 1966

వెంకటప్పయ్య, వెలగా (సం). రాయలసీమ పలుకుబడులు, తెలుగు సాహితి, 1979

వెంకటరావు, నిడదవోలు. తెలుగు సామెతలు, భారతి, జనవరి, 1966.

వెంకయ్య, మారన. భాస్కర శతకము, గొల్లపూడి వీరాస్వామి సన్, రాజమండ్రి, 2005

వేంకట నరసయ్య, వెల్లంకి. రైతు సామెతల సమీక్ష తెలుగు విశ్వవిద్యాలయం, హైదరబాదు, 1989

వేంకట రమణయ్య, బులుసు. వేమన పద్య రత్నాకరము, బాల సరస్వతీ బుక్ డిపో, మద్రాసు, కర్నూలు, 2003

వేంకట శాస్త్రి, ముసునూరి. విద్యార్థి కల్పతరువు, వెంకట్రామ అండ్ కో, ఏలూరు, 1984

వేంకటరావు, నిడదవోలు. సాటి సామెతలు (సంకలనం). మరియప్ప భట్, ఎమ్. విజయా పబ్లికేషన్స్, మద్రాసు, 1960

వేంకటావధాని, దివాకర్ల. తెలుగు సామెతలు (మూడవ కూర్పు యశోదారెడ్డి కోదండరామ రెడ్డి, మరుపూరు

తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1986

శ్రీనివాసరావు, వేమూరి. పూర్వ గాథా లహరి, వెంకట్రామ అండ్ కో, విజయవాడ, 1976

సరళాదేవి, పి. తెలుగు సామెతలు - సాంఘిక చరిత్ర, శర్వాణి ప్రచురణలు, విజయనగరం, 1987

సర్వేశ్వర శాస్త్రి, దర్భా శ్రీ సూర్యారాయాంధ్ర నిఘంటువు (ఆరవ సంపుటం). తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1988

సీతారామాచార్యులు, బి. శబ్ద రత్నాకరము. ద మద్రాస్ స్కూల్ బుక్ అండ్ లిటలేచర్ సొసైటీ, మద్రాసు 1958

సుందరం, ఆర్వీయస్, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983.

Dermot Cox. Old Testament Message: Proverbs Michael Glazier, Inc., Delaware, 1982

Dorson Richard, M. (ed). Folklore and Folklife The University of Chicago Press, Chicago, 1972

Dundes, Alan. The Study of Folklore University of California, Berkely, 1965

Fitzmyer, J.A. (ed). Theological Publication of India, Bangalore, 1990

Kinder, D. The Proverbs: An Introduction and Commentary Tyndale Press, London, 1964

McKane, W. Proverbs: A New Approach, S.C.M. Press, London, 1970

Murphy, R.E. Seven Books of Wisdom Bruce Publishing House Co., Milwaukee, 1960

Norton, P.B. and others. New Encyclopaedia Britanica, London, 1995

Rankin, O.S. Israel's Wisdom Literature Schoken Books, New York, 1969

Reginald, C.F. (ed). New Catholic Commentary on the and others Holy Scripture Nelson, London, 1969

Scott, R.B.Y. The Way of Wisdom in the Old Testament. Macmillan Co., New York, 1971

Subramanian, P.R. An Introduction to the Study of Indian Folklore, Tuticorin, 1972

von Rad, G. Wisdom in Israel, S.C.M. Press, London, 1972

Whybray, R.N. The Book of Proverbs. (Cambridge Bible Commentary) Cambridge University Press, 1972